



Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక






మంగళవారం 01-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :75 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ ఫైట్!




**న్యూస్ డెస్క్, 31 ఆగస్టు (ఇది కద నిజం):** రాష్ట్రంలో 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు ప్రతిపక్ష భారత రాష్ట్రీయ సమితి పోరుబాటకు సిద్ధమైంది.

## చలాన్ పడిందంటే.. డబ్బులు కట్!

- చలాన్ పడితే ఆటో డెబిట్?
- ఫాస్టాగ్ నుంచీ ఫైన్ కట్!
- పెండింగ్ చలాన్లకు చెక్!
- టోల్‌గేట్ దగ్గరే చలాన్ వసూలు?
- చలాన్లపై డిస్కౌంట్లు బంద్!
- బండి తీస్తే రూల్స్ పాటించాల్సిందే!




**న్యూస్ డెస్క్, 31 ఆగస్టు (ఇది కద నిజం):** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి.. డిస్కౌంట్ వచ్చినప్పుడు చలాన్లు కట్టుకుందాంలే అని నిర్లక్ష్యంగా వ్యవహరించే వాహనదారులకు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇవ్వబోతున్నది. రోడ్డు భద్రత, ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ఇకపై ఫైన్లను నేరుగా వాహనదారుడి బ్యాంక్ ఖాతాలు, ఫాస్టాగ్ నుంచి ఆటో డెబిట్ పద్ధతిలో వసూలు చేసేలా కొత్త విధానానికి కసరత్తు వేగవంతం చేసినట్టు తెలుస్తున్నది.

## కరువు నేలకు జలకళ



**న్యూస్ డెస్క్, 31 ఆగస్టు (ఇది కద నిజం):** మార్కాపురం జిల్లా గంటవానిపల్లిలో వెలిగొండ ప్రాజెక్టును సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కృష్ణా నీటికి జలహారతి ఇచ్చి పైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. 30 ఏళ్ల క్రితం ఈ ప్రాజెక్టుకు ఆయన శ్రీకారం చుట్టారు. తొలిదశ పూర్తి అయింది. దీంతో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ ప్రాజెక్టు ద్వారా నల్లమల్ల సాగర్‌కు కృష్ణానీళ్లను విడుదల చేశారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల రైతులకు సాగు నీరు అందనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. మిగతాది 2 లో..

- మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర
- వెలిగొండతో కరువు నేలకు జలకళ
- చంద్రబాబు చేతుల మీదుగా చారిత్రక ఘట్టం
- కృష్ణా జలాలతో నల్లమలసాగర్ నిండే వేళ
- నాలుగు జిల్లాలకు నీటి మహావరం
- లక్షల ఎకరాలకు సాగునీటి భరోసా
- 4 లక్షల మందికి తాగునీటి ఊరట
- 30 ఏళ్ల సంకల్పం.. నేడు సాకారం

## తుక్కుగూడ నర్సు హత్య




- శిరీషపై అఘాయిత్యానికి యత్నం
- ప్రతిఘటించడంతో గొంతు నులిమి హత్య
- ఆస్పత్రి సమీపంలోనే నిందితుడి సంచారం
- కిటికీ ద్వారా హాస్టల్‌లోకి ప్రవేశం
- కార్ల మెకానిక్ సనావుల్లా అరెస్ట్
- పోస్టుమార్టంలో లైంగిక దాడి నిర్ధారణ
- మరెవరైనా ఉన్నారా? పోలీసుల దర్యాప్తు

## కదిలే బస్సులో గ్యాంగ్ రేప్!

- 16 ఏళ్ల బాలికపై గ్యాంగ్‌రేప్
- నిర్భయ ఘటనను తలపించే దారుణం
- డ్రైవర్, కండక్టర్ కిరాతకం
- 47 కి.మీ ప్రయాణంలో అమానుషం
- తెరలు దించి.. అఘాయిత్యానికి పాల్పడి
- ఢిల్లీ చేరేసరికి దారుణం
- ఇద్దరు నిందితులు అరెస్ట్




**న్యూస్ డెస్క్, 31 ఆగస్టు (ఇది కద నిజం):** దేశ రాజధాని ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో నిర్భయ ఘటనను తలపించే మరో దారుణం వెలుగుచూసింది. ఉత్తరప్రదేశ్ నుంచి వస్తున్న 16 ఏళ్ల మైనర్ బాలికపై కదులుతున్న స్లీపర్ బస్సులోనే డ్రైవర్, కండక్టర్ కలిసి విచక్షణారహితంగా గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. ఆగస్టు 4న చోటుచేసుకున్న ఉందంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులైన డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌లను అరెస్టు చేశారు.

47 కి.మీ ప్రయాణంలో అమానుషం.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

## వెలిగొండపై హరీశ్ రావు ఫైర్!




- వెలిగొండ నుంచి నీటి తరలింపుపై అభ్యంతరం
- రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్
- తెలంగాణ నీటి హక్కులకు తీరని ద్రోహమంటూ విమర్శ
- కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు నీరేది?
- కేఆర్ఎంబీ తీరుపైనా తీవ్ర ఆగ్రహం
- ఏపీ నీటి తరలింపును అడ్డుకోవాలని డిమాండ్

## రాజకీయాల్లో కొత్త మార్పు!

- నా పాత్ర కీలకం: రాజగోపాల్‌రెడ్డి
- నిజాయితీపరులను అసెంబ్లీకి తెస్తా!
- మంత్రి పదవి ముఖ్యం కాదు!
- నాయకుల ఆలోచనా విధానం మారాలి
- అవినీతి గ్రామాలకూ పాకింది!
- రైతు డబ్బు.. బెల్ట్ షాపులకు పోతుందా?
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కీలక వ్యాఖ్యలు




**న్యూస్ డెస్క్, 31 ఆగస్టు (ఇది కద నిజం ):** రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు స్పష్టమైన మార్పు దిశగా పయనిస్తాయని, రాబోయే రోజుల్లో రాజకీయాల్లో మార్పులు తీసుకువచ్చి పేదవారికి సేవ చేయాలని భావిస్తున్నానన్నట్లు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అవసరం అయితే నిజాయితీపరులైన వారిని అసెంబ్లీలో అడుగుపెట్టేలా చేస్తానన్నారు. ఈ మార్పులో నా పాత్ర కీలకంగా ఉండబోతోందని డబ్బుల కోసం రాజకీయం చెయ్యడానికి వచ్చిన వాళ్ళు శాశ్వతంగా ఉండలేరని డబ్బులే కావాలనుకునే వారు వ్యాపారం చేసుకోవాలన్నారు. వ్యవస్థ మొత్తం అవినీతి మయం అయ్యాయిందని అధికారులు, రాజకీయ నాయకులు అవినీతికి పాల్పడుతుంటే పేదలకు న్యాయం ఎలా లభిస్తుందని ప్రశ్నించారు. అవినీతి గ్రామీణ ప్రాంతం వరకు పాకిందనన్నారు. వైఎస్ఆర్?సీపీ పార్టీ ఎన్ఆర్?ఐ టీమ్ ఏర్పాటు చేసిన ట్విట్టర్ స్పేస్ లో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి హాజరై సంచలన వ్యాఖ్యలు చేశారు.

అందుకే ప్రతి విషయాన్ని మాట్లాడుతున్నా..

తనకు మంత్రి పదవి ముఖ్యం కాదని రాజకీయ నాయకుల ఆలోచన విధానం, వ్యవస్థ మారాలన్నారు. వార్పు దిశగా అడుగులు వేస్తున్నానని అందుకే గత కొన్ని నెలలుగా నేను ప్రతి విషయాన్ని మాట్లాడుతున్నానన్నారు.

## రేవంత్ కేబినెట్‌లో మంత్రులకు స్వేచ్ఛ లేదా?

- మంత్రులకు శాఖలపై పూర్తి అధికారం ఇవ్వాలి
- స్వేచ్ఛ లేకపోతే ప్రభుత్వానికి ఇబ్బందులే
- రేవంత్ సర్కార్‌పై కూనంనేని కీలక వ్యాఖ్యలు
- సీఎంపై వ్యక్తిగత విమర్శలు సరికాదన్న నేత
- భూ సమస్యలపై ప్రభుత్వ తీరుపై అసంతృప్తి
- నిషేధిత జాబితాతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్
- ప్రభుత్వ అలసత్వంపై కూనంనేని ఫైర్

2 లో

## మూసీ కోసం సర్కార్ బిగ్ ప్లాన్!

- మల్లన్నసాగర్ నుంచి మూసీకి జలాలు!
- 20 టీఎంసీల నీటి తరలింపునకు ప్లాన్
- రెండు భారీ పైప్‌లైన్ల నిర్మాణం
- ఒక్కో పైప్‌లైన్ సామర్థ్యం 10 టీఎంసీలు
- రూ.5,383 కోట్లతో పనులు
- మల్లన్నసాగర్-ఘన్‌పూర్ వరకు తొలి ప్యాకేజీ
- ఘన్‌పూర్-ఉస్మాన్‌సాగర్ వరకు రెండో ప్యాకేజీ




**న్యూస్ డెస్క్, 31 ఆగస్టు (ఇది కద నిజం):** హైదరాబాద్ నగర వాసులకు నీటి కొరత తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవనంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి ఘన్‌పూర్ వరకు నీటిని తరలించేందుకు రెండు భారీ పైప్‌లైన్ల నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండు పైప్‌లైన్లలో ఒక్కో పైప్‌లైన్ దాదాపు 10 టీఎంసీల నీటిని తరలించే సామర్థ్యం కలిగి ఉంటుందని పేర్కొంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవనంలో ప్రాజెక్టులో భాగంగా మూసీ పునరుజ్జీవనంతోపాటు హైదరాబాద్ మహా నగరానికి తాగునీటి సమస్యను పరిష్కరించడానికి మల్లన్నసాగర్ నుంచి 20టీఎంసీల నీటిని గోదావరి తాగునీటి ప్రాజెక్టు 2,3 దశల ద్వారా తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## మహిళల స్వేచ్ఛపై తీవ్ర దుమారం

- మహిళలను ఇళ్లకే పరిమితం చేయాలన్న వ్యాఖ్యలు
- బంగారు ఆభరణాలతో మహిళలకు పోలిక
- హిజాబ్ ఆత్మగౌరవం కోసమేనన్న మతబోధకుడు
- మహిళలకు ఆస్తి హక్కులపై ప్రస్తావన
- వ్యాఖ్యలపై మహిళా సంఘాల ఆగ్రహం
- మానవ హక్కుల నేతల నుంచి తీవ్ర నిరసన
- సోషల్ మీడియాలోనూ వెల్లువెత్తిన విమర్శలు

2 లో

## అమెరికాలో ప్రేమ.. భారత్‌లో మౌనమా?

- మోహన్ భగవత్‌కు నారాయణ సూటి ప్రశ్న!
- భారత్‌లోనూ అదే మాట చెప్పగలరా?
- ఆర్ఎస్ఎస్‌కు రెండు నాలుకలా?
- విదేశాల్లో ఒక మాట.. దేశంలో మరో మాట!
- మతసామరస్యంపై నారాయణ ఫైర్
- ముస్లింల హక్కులపై స్పష్టత ఇవ్వాలి!
- మాటల్లో కాదు.. చేతల్లో చూపించాలి!

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 01-09-2026

# రేవంత్ కేబినెట్‌లో మంత్రులకు స్వేచ్ఛ లేదా?



**న్యూస్ డెస్క్, 31 ఆగస్టు (ఇది కద నిజం):** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనా తీరుపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి కేబినెట్‌లోని మంత్రులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ లేదని, వారి శాఖలపై మంత్రులకే అధికారం, పూర్తి హక్కులు కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. మంత్రులకు తగిన స్వేచ్ఛ ఇవ్వకపోతే రానున్న రోజుల్లో లేని సమస్యలు తెరపైకి వచ్చి ప్రభుత్వానికి ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. అదే సమయంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుశ్మిత చేసిన వ్యాఖ్యలను కూనంనేని తప్పుపట్టారు. రాజకీయంలో విధానపరమైన విమర్శలు ఉండాలి తప్ప, సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడం ఎంతమాత్రం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.

మరోవైపు రాష్ట్రంలో భూ సమస్యలు, ప్రభుత్వ అలసత్వంపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టడం వల్ల ప్రజలు, రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం తీవ్ర అలసత్వంతో వ్యవహరిస్తోందని, సమస్యల తీవ్రతను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడంలో విఫలమవుతోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిషేధిత జాబితా భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కూనంనేని సాంబశివ రావు డిమాండ్ చేశారు.

# చలాన్ పడిందంటే.. డబ్బులు కట్!

మొదటి పేజీ తరువాయి

ఈ ఏడాది ప్రారంభంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఈ విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. వెహికల్ రిజిస్ట్రేషన్ టైమ్‌లోనే వాహనదారుడి బ్యాంక్ అకౌంట్ వివరాలు తీసుకోవాలని, చలాన్ పడిన వెంటనే బ్యాంక్ అకౌంట్ నుంచి ఆటో డెబిట్ అయ్యేలా సాఫ్ట్‌వేర్ రూపొందించాలని రవాణా, పోలీసుశాఖల అధికారులకు సూచించారు. ఇకపై చలాన్లపై ఎలాంటి డిస్కౌంట్లు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. సీఎం చేసిన సూచనలను ఆచరణలో పెట్టేందుకు రవాణా, పోలీసు యంత్రాంగాలు ఉమ్మడిగా కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ సాంకేతిక సహకారంతో కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించే పనిలో పడ్డారని చర్చ జరుగుతున్నది.

టోల్‌గేట్ దాటలేరు..

పెండింగ్ చలాన్ల వసూలుకు పోలీస్ శాఖ మరో కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు చర్చ జరుగుతున్నది. రాజధాని చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు, ఇతర జాతీయ రహదారులపై వాహనాలు టోల్‌ప్లాజాల గుండా వెళ్లేటప్పుడు, వాటికి ట్రాఫిక్ చలాన్లు ఏమైనా పెండింగ్ ఉంటే.. ఆ మొత్తాన్ని నేరుగా వారి ఫాస్టాగ్ వాలెట్ నుంచి డెబిట్ చేసే ఆలోచనను తెరపైకి తీసుకొచ్చినట్టు సమాచారం. ఈ సరికొత్త విధానంపై హెచ్‌ఎండీఏ అధికారులతో ట్రాఫిక్ పోలీసులు ఆగస్టు నెలలో ప్రాథమిక చర్చలు జరిపినట్టు తెలిసింది. ఈ విధానం అమలులోకి వస్తే.. టోల్ గేట్ వద్ద వాహనం ఆగగానే అక్కడి స్కానర్ ఫాస్టాగ్‌ను రీడ్ చేస్తుంది. ఆ వెంటనే టోల్ ఫీజుతో పాటే.. ఆ వాహనంపై ఉన్న పాత ట్రాఫిక్ చలాన్ల డబ్బులు కూడా ఆటోమేటిక్‌గా కట్ అయిపోతాయి. ఒకవేళ ఫాస్టాగ్‌లో తగినంత బ్యాలెన్స్ లేకపోతే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడం లేదా టోల్ గేట్ వద్దే వాహనాన్ని ఆపేసే సాంకేతికతను అనుసంధానం చేసే సాధ్యాసాధ్యాలను అధికారులు సీరియస్‌గా పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఈ ప్రక్రియ కోసం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఆర్బీఐ నిబంధనలను కూడా అధ్యయనం చేస్తున్నట్టు సమాచారం.

చాశ్రీంశీ =ఘుం – శిరీష కుటుంబానికి పెద్దదిక్కుగా ఎమ్మెల్యే జారే

కఠిన చర్యలు ఎందుకంటే..

గత కొన్నేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది వాహనాలపై రూ. వందల కోట్ల చలాన్లు పేరుకుపోయాయి. చాలామంది ఉద్దేశపూర్వకంగానే చలాన్లు చెల్లించడం లేదని, శిక్ష పడదన్న ధీమాతో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని ప్రభుత్వం భావిస్తున్నది. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడడమే కాకుండా.. వరుస రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నట్టు అంచనా వేస్తున్నది. దీన్ని అరికట్టాలంటే జరిమానాల వసూళ్లు పక్కాగా జరగాలని, తప్పు చేస్తే జేబుకు చిల్లు పడుతుందన్న భయం ఉంటేనే రోడ్లపై క్రమశిక్షణ వస్తుందని ప్రభుత్వం పేర్కొంటున్నది. బ్యాంక్ ఖాతా ఆటో డెబిట్, ఫాస్టాగ్ లింకింగ్ ప్రక్రియలు ప్రస్తుతం ప్రతిపాదనలు, ఉన్నత స్థాయి చర్చల దశలోనే ఉన్నప్పటికీ.. త్వరలోనే ఇవి ఒక కొలిక్కి వచ్చి అధికారికంగా అమల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాల ద్వారా తెలిసింది. అన్నీ కుదిరితే త్వరలోనే దీనికి సంబంధించిన మార్గదర్శకాలు వెలువడే అవకాశం ఉంది. అదే జరిగితే.. బండి తీస్తే నిబంధనలు పాటించాల్సిందేనన్న కఠిన సందేశం ప్రజల్లోకి బలంగా వెళ్లనుంది.

# కరువు నేలకు జలకళ

మొదటి పేజీ తరువాయి

శ్రీశైలం జలాశయం నుంచి 43.53 టీఎంసీల కృష్ణా వరద జలాలను నల్లమల కొండల గుండా మళ్లించి, మొత్తం



4,47,300 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో వెలిగొండ ప్రాజెక్టును రూపొందించారు. మార్కాపురం జిల్లాలో 3,08,700 ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 27,400 ఎకరాలు, వైఎస్ఆర్ కడప జిల్లాలో 27,200 ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84,000 ఎకరాలకు సాగునీరు అందేలా ప్రాజెక్టు రూపకల్పన జరిగింది.

ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవంతో దశాబ్దాలుగా తీవ్ర కరువును ఎదుర్కొంటున్న మార్కాపురం జిల్లా ప్రజల చిరకాల స్వప్నం సాకారం అయింది. వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. వెలిగొండ ప్రాజెక్టుతో మార్కాపురం ప్రాంతంతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాలకు కొత్త జీవం పోశారు. ముఖ్యంగా 30 ఏళ్ల క్రితం 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టు తొలి దశను స్వయంగా ప్రారంభించారు. 'వెలిగొండ జలసిరులు–అభివృద్ధికి రెక్కలు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

**తొలిదశతో కొత్త అధ్యాయం..**

తొలి దశ ప్రారంభం ద్వారా 10.70 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు విడుదలకు శ్రీకారం చుట్టారు. తొలి విడతలో సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేసింది.

**30 ఏళ్ల ప్రయాణం.. సంకల్పం నుంచి సాకారం వరకు..**

1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు ప్రయాణంలో ఎన్నో సాంకేతిక, ఆర్థిక, నిర్మాణపరమైన సవాళ్లు ఎదురయ్యాయి. సొరంగాల నిర్మాణం, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, భూసేకరణ, పునరావాసం వంటి క్లిష్టమైన అంశాలను అధిగమిస్తూ ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయి. 2024లో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన అనంతరం వెలిగొండను అత్యంత ప్రాధాన్యతా ప్రాజెక్టుగా తీసుకుని పనులను వేగవంతం చేసింది. టన్నెల్ పనులు, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, ఇతర అనుబంధ నిర్మాణాలతో పాటు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, పరిహారం చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం 48 రోజుల వ్యవధిలో నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల మేర పరిహారం చెల్లింపులు జరపడం ద్వారా పనులకు వేగం తీసుకువచ్చింది. అంతేకాకుండా గెజిట్, జాబితాలో పేర్లు లేని వారికోసం మరో రూ.169 కోట్లు, 2019 తర్వాత 18 ఏళ్ల నిండిని వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. 'శంకుస్థాపన చేసింది చంద్రబాబు... ప్రారంభించింది ఆయనే' కావడంతో అరుదైన చారిత్రక ఘట్టానికి ఈ రోజు వేదిక కానుంది. 30 ఏళ్ల క్రితం చేసిన సంకల్పం ఇప్పుడు సాకారమవడంతో మార్కాపురం ప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది..

# అమెరికాలో ప్రేమ.. భారత్‌లో మౌనమా?



**న్యూస్ డెస్క్, 31 ఆగస్టు (ఇది కద నిజం):** ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ విదేశీ పర్యటనల్లో మాట్లాడే మాటలకు, భారతదేశంలో ఆర్ఎస్ఎస్ సంస్థ అనుసరిస్తున్న తీరుకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందంటూ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమెరికా పర్యటనలో మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ నారాయణ ఒక ఘాటైన ప్రకటన విడుదల చేశారు. అమెరికాలో జరిగిన ఒక కార్యక్రమంలో మోహన్ భగవత్ మాట్లాడుతూ.. భారత్‌లో ముస్లింలు ఉండకూడదని భావించే వ్యక్తి అసలు నిజమైన హిందువే కాదని, మత సామరస్యం, భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ ఆత్మ అని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై సీపీఐ నారాయణ స్పందించారు.

అమెరికాలోనే ఎందుకు ఈ ప్రేమాభిమానాలు?

ముస్లింలు కూడా భారతదేశ సమాన పౌరులేనని, వారి హక్కులు భద్రమని, హిందూ–ముస్లింల ఐక్యతే దేశ శక్తిని అమెరికా వేదికలపై చెప్పిన మోహన్ భగవత్.. అదే మాటను భారతదేశంలో స్పష్టమైన గొంతుతో ఎందుకు ప్రకటించడం లేదు? నారాయణ ప్రశ్నించారు. అమెరికా పర్యటన సందర్భంగా స్థానికంగా ఎదురైన తీవ్ర వ్యతిరేకత, నిరసనల నుంచి తప్పుకోవడానికే మోహన్ భగవత్ అక్కడ మతసామరస్య వేదాంతం మాట్లాడారా? అని అడిగారు. ఇంట్లో (భారత్) ఒక మాట, బయట (అమెరికాలో) మరొక మాట మాట్లాడటం ఆర్ఎస్ఎస్ ద్వంద్వ విధానాలకు నిదర్శనం కాదా?, ఆర్ఎస్ఎస్‌కు రెండు నాలుకలు ఉన్నాయా? అని నారాయణ ప్రశ్నలు సంధించారు. భారతదేశంలో కూడా ముస్లింల హక్కులు, హిందూ–ముస్లిం ఐక్యతపై ఆర్ఎస్ఎస్ ఎలాంటి దాపరికం లేకుండా స్పష్టమైన, నిర్భయమైన ప్రకటన చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. మాటల్లో చెప్పడమే కాకుండా చేతల్లో కూడా ఆ సామరస్యాన్ని నిరూపించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# మహిళల స్వేచ్ఛపై తీవ్ర దుమారం



**న్యూస్ డెస్క్, 31 ఆగస్టు (ఇది కద నిజం):** దేశంలో మహిళలు తమ ఇళ్లకే పరిమితం కావాలని, వారు బహిరంగ ప్రదేశాల్లోకి రాకూడదని ప్రముఖ కేరళ మతబోధకుడు షేక్ అబూబకర్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇస్లాంలో మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకే హిజాబ్ పద్ధతిని సూచించారని, మహిళలను బయటకు తీసుకురావడం వల్ల తీవ్ర వినాశనం రుగుతుందని ఆయన కామంట్ చేశారు.

మహిళలను బంగారు హారంతో పోలుస్తూ..

కొచ్చిలో జరిగిన హుబ్బుల్ రసూల్ సదస్సులో అఖిల భారత సున్నీ జమియ్యతుల్ ఉలమా, సమస్త కేరళ జెమ్–ఇయ్యతుల్ ఉలమా ప్రధాన కార్యదర్శిగా ఉన్న షేక్ అబూబకర్ అహ్మద్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలను బంగారు ఆభరణాలతో పోల్చారు. 'ఒకరు జ్యువెలరీ షాప్‌లో బంగారు హారాన్ని కొనుగోలు చేసేటప్పుడు దానిని కప్‌బోర్డ్‌లోని పెట్టెలో, పేపర్‌లలో భద్రంగా దాచి చూపిస్తారు. అదే రోడ్డు పక్కన అమ్మే రుబ్బురోళ్లను అందరూ తొక్కుతూ వెళ్తారు. బంగారు హారం దాని అందాన్ని, విలువను కాపాడుకోవాలంటే పెట్టెలోనే భద్రంగా ఉండాలి. రోడ్డుపై పెడితే వెళ్లే ప్రతి ఒక్కరూ తాకి దాని అందాన్ని పాడుచేస్తారు. మహిళలను కూడా ఇలాగే బహిరంగ సమాజంలోకి తీసుకొస్తే పెద్ద వినాశనానికి దారితీస్తుంది' అని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రాచీన అరేబియాలో ఆడపిల్లలను నిలువునా పూడ్చిపెట్టే అనాచారాన్ని ఇస్లాం నిషేధించిందని, ఆస్తి హక్కులు లేని కాలంలోనే మహిళలకు ఆస్తి హక్కులు కల్పించిందని గుర్తుచేశారు. గత 100 ఏళ్లుగా తమ మత పండితులు ఇదే విషయాన్ని బోధిస్తున్నారని, దీనివల్లే దేశంలోని మహిళలు తమ గౌరవాన్ని కాపాడుకోగలుగుతున్నారని షేక్ అబూబకర్ అహ్మద్ అన్నారు.

వివాదాస్పద వ్యాఖ్యలపై నిరసన జ్వాలలు..

షేక్ అబూబకర్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలపై కేరళ రాష్ట్రంలోని మహిళా సంఘాలు, మానవ హక్కుల నాయకులు, సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. 21వ శతాబ్దంలో సమానత్వం, మహిళా సాధికారత గురించి మాట్లాడుతుంటే.. మహిళలను వస్తువులతో పోలుస్తూ వారి స్వేచ్ఛను హరించేలా మాట్లాడటం అజ్ఞానానికి పరాకాష్ట అని ఫైర్ అవుతున్నారు.

# కదిలే బస్సులో గ్యాంగ్ రేప్!

మొదటి పేజీ తరువాయి

ఉత్తరప్రదేశ్‌లోని మైన్‌పురి జిల్లాకు చెందిన 16 ఏళ్ల విద్యార్థిని కుటుంబ సభ్యులతో గొడవపడి నోయిడాలోని తన బంధువుల ఇంటికి వెళ్లేందుకు బయలుదేరింది. ఈ క్రమంలో ఆమె గ్రేటర్ నోయిడాలోని పరిచౌక్ వద్ద ఢిల్లీ వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ స్లీపర్ బస్సు ఎక్కింది. గ్రేటర్ నోయిడాలోని పరిచౌక్ నుంచి ఢిల్లీలోని కశ్మీరీ గేట్ వరకు ఉన్న దాదాపు 47 కి.మీ ప్రయాణ దూరంలో ఈ దారుణం జరిగింది.

బస్సు విండోలకు ఉన్న తెరలు దించి..

అయితే, స్లీపర్ బస్సు కిటికీలకు తెరలు వేసి ఉండటంతో లోపల ఏం జరుగుతుందో బయటి వారికి కనిపించకుండా పోయింది. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకున్న బస్సు డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌లు కదులుతున్న బస్సులోనే బాలికపై అమానుషంగా అత్యాచారానికి ఒడిగట్టారు. దారుణం ముగిశాక బాలికను ఢిల్లీలోని కశ్మీరీ గేట్ బస్ స్టాండ్ వద్ద దింపి నిందితులు పరారయ్యారు. అనంతరం అచేతన స్థితిలో ఉన్న బాధితురాలు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేయడంతో వారు స్పాట్‌కు చేరుకుని ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు బస్సు సమాచారం ఆధారంగా విచారణ జరిపి డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# మూసీ కోసం సర్కార్ బిగ్ ప్లాన్!



**న్యూస్ డెస్క్, 31 ఆగస్టు (ఇది కద నిజం):** హైదరాబాద్ నగర వాసులకు నీటి కొరత తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవనంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి ఘన్‌పూర్ వరకు నీటిని తరలించేందుకు రెండు భారీ పైప్‌లైన్ల నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండు పైప్‌లైన్లలో ఒక్కో పైప్‌లైన్ దాదాపు 10 టీఎంసీల నీటిని తరలించే సామర్థ్యం కలిగి ఉంటుందని పేర్కొంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవనంలో ప్రాజెక్టులో భాగంగా మూసీ పునరుజ్జీవనంతోపాటు హైదరాబాద్ మహా నగరానికి తాగునీటి సమస్యను పరిష్కరించడానికి మల్లన్నసాగర్ నుంచి 20టీఎంసీల నీటిని గోదావరి తాగునీటి ప్రాజెక్టు 2,3 దశల ద్వారా తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ పనులకు సంబంధించిన టెండర్లను ఆహ్వానిస్తూ జలమండలి గతంలోనే నోటిఫికేషన్ జారీచేసింది. హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో రూ.5383.67కోట్లతో రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టాలని నోటిఫికేషన్?లో జలమండలి పేర్కొన్నది. 2,3 దశలకు సంబంధించిన పైపులైన్ లను రెండు వరుసలుగా వేయనున్నారు. మొదటి ప్యాకేజీలో మల్లన్నసాగర్ నుంచి ఘన్ పూర్ వరకు, రెండో ప్యాకేజీలో ఘన్ పూర్ నుంచి ఉస్మాన్ సాగర్ వరకు పనులు చేపట్టనున్నారు. ఈ రెండు ప్యాకేజీల్లో పైపులైన్, పంపింగ్, నిర్మాణంతోపాటు టెస్టింగ్, కమిషనింగ్ వంటి కార్యక్రమాలను అన్నింటిని కలిపి ప్రాజెక్టు విలువ అంచనా వేశారు.

# కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ ఫైట్!

మొదటి పేజీ తరువాయి

ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సర్కార్ విఫలమైందంటూ సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వరుస నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు పార్టీ నాయకత్వం పిలుపునిచ్చింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 420 హామీలతో పాటు 13 డిక్లరేషన్లను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ అంశాలన్నింటినీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ఎండగట్టడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పోరుబాట పట్టనున్నట్లుగా స్పష్టం చేసింది.

ఆరు గ్యారెంటీల వైఫల్యంపై జంగ్..

అధికారంలోకి వచ్చిన తర్వాత హస్తం పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ విమర్శించింది. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సెప్టెంబర్ 2 నుంచి చేపట్టే ఈ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చింది.

# వెలిగొండపై హరీశ్ రావు ఫైర్!

న్యూస్ డెస్క్, 31 ఆగస్టు (ఇది కద నిజం): వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలిస్తుంటే.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చోద్యం చూస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఏపీ అడ్డగోలుగా నీటి దోపిడీకి పాల్పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నోరు మెదపకపోవడం తెలంగాణ రైతాంగానికి చేస్తున్న తీరని ద్రోహమని మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా హరీశ్ రావు చేసిన పోస్టులో రాష్ట్ర ప్రభుత్వం, కేఆర్ఎంబీ తీరును తీవ్రంగా తప్పుబట్టారు.

"నీటి కేటాయింపులు లేకున్నా.. వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి చోద్యం చూస్తుండటం తెలంగాణకు తీరని ద్రోహం. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోంది. ఒకవైపు కృష్ణా బేసిన్‌లో భాగమైన బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టులు ఎండిపోతుంటే.. మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యదేచ్ఛగా నీటిని తరలిస్తోంది. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ నుంచి నీటి తరలించే ప్రయత్నం చేస్తుంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు. రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహం ఇది. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు?. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబి సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే.. రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి?. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెంటనే స్పందించాలి. కేఆర్ఎంబి పై ఒత్తిడి తెచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం" అని హరీశ్ రావు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేశారు.

# రాజకీయాల్లో కొత్త మార్పు!

మొదటి పేజీ తరువాయి

పదవుల కంటే రాజకీయ నాయకుల ఆలోచనా విధానం, వ్యవస్థలో మార్పు రావడమే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒక చేత్తో రైతు బంధు లాంటి పథకాల ద్వారా డబ్బులు ఇస్తూ, మరో చేత్తో బెల్ట్ షాపుల ద్వారా ఆ సొమ్మును గుంజుకోవడం సరికాదని కోమటిరెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గంలో బెల్ట్ షాపులను పూర్తిగా ఎత్తివేయించగలిగానని, ప్రజలకు నష్టం కలిగించే చర్యలను ప్రభుత్వం ఇప్పటికైనా నిలిపివేయాలని డిమాండ్ చేశారు.


ఆయన ఆశీర్వాదం వల్లే:

వైఎస్ రాజశేఖర్ రెడ్డి అంటే తనకు చాలా అభిమానం అని ఆయన ఎప్పటికీ నా గుండెల్లో ఉంటారన్నారు. పేద ప్రజల కోసం ఆయన తీసుకువచ్చిన కార్యక్రమాలు ఎప్పటికీ మర్చిపోలేం. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి కార్యక్రమాలు చేశారు. వైఎస్సార్ ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా ఒక కుటుంబ సభ్యుడిగా నిలిచారు. కాంగ్రెస్ పార్టీలో ఆయన లాంటి మరొక లీడర్ లేనే లేడన్నారు. తెలంగాణ ఏర్పడినా ఆయన అంటే మాకు ఎనలేని అభిమానం ఉందని తెలంగాణ ఉద్యమం పీక్స్ లో ఉన్న సమయంలో మా గ్రామంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు. కోమటిరెడ్డి బ్రదర్స్ అంటే రాజశేఖర్ రెడ్డి టీమ్ అని అంటారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇవాళ ఈ స్థాయిలో ఉన్నారంటే అది వైఎస్సార్ ఆశీర్వాదమేనన్నారు. రాజశేఖర్ రెడ్డి ఇన్స్పిరేషన్ తోనే నేను రాజకీయాల్లోకి వచ్చాను.

బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం..

ఫీజు రీయింబర్స్ మెంట్ రాను రాను మిస్ యూజ్ అవుతోందని కోమటిరెడ్డి అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ కోసమే ఇంజనీరింగ్ కాలేజీలు పుట్టగొడుగుల్లా పుట్టుకు వచ్చాయని సరైన మౌళిక వసతులు లేకుండానే ఇంజినీరింగ్ కాలేజీలు వచ్చాయన్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం సమయానికి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వమేమో అప్పుల్లో ఉంది. ఫీ రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. సరైన రీతిలో మానిటరింగ్ ఉంటే ఇది చాలా మంచి పథకం అన్నారు. ఫీజు రీయింబర్స్ ఖర్చు అని అనుకోవద్దు. ఇది మన యువతపై పెడుతున్న ఇన్వెస్ట్ మెంట్ అనుకోవాలి.

# తుక్కుగూడ నర్సు హత్య



**న్యూస్ డెస్క్, 31 ఆగస్టు (ఇది కద నిజం):** తుక్కుగూడలో నర్సు శిరీష హత్య కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఒంటరిగా ఉన్న సమయంలో శిరీషపై లైంగిక దాడికి ప్రయత్నించి, అనంతరం ఆమెను హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి బిహార్‌కు చెందిన కార్ల మెకానిక్ మహ్మద్ సనావుల్లా (34)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఖమ్మం జిల్లా ముల్కలపల్లి మండలానికి చెందిన 21 ఏళ్ల శిరీష సుమారు ఎనిమిది నెలల క్రితం తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా చేరింది. ఆస్పత్రి ఆవరణలో ఉన్న హాస్టల్‌లో తోటి నర్సులతో కలిసి ఉంటోంది. రాఖీ పండుగ సందర్భంగా రూమ్‌మేట్స్ స్వగ్రామాలకు వెళ్లడంతో శుక్రవారం రాత్రి శిరీష తన గదిలో ఒంటరిగా నిద్రించింది. శనివారం మధ్యాహ్నం వరకు శిరీష గది నుంచి బయటకు రాకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చింది. కిటికీలోంచి చూడగా ఆమె విగతజీవిగా కనిపించింది. దీంతో పహాడీషరీఫ్ పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో లభించిన ఆధారాల ఆధారంగా లైంగిక దాడి, హత్య కోణంలో విచారణ చేపట్టారు.

చివరకు ఆస్పత్రి సమీపంలోని కార్ల మెకానిక్ షాపులో పనిచేస్తున్న సనావుల్లా ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఇతర కార్మికులు వెళ్లిపోయిన తర్వాత అతడు అక్కడే నిద్రించేవాడని, కొంతకాలంగా ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సుల కదలికలను గమనించినట్లు దర్యాప్తులో తేలింది. శిరీష ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించిన సనావుల్లా.. అర్ధరాత్రి హాస్టల్‌లోకి ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. శిరీష ఉంటున్న గది కిటికీకి గ్రిల్స్ లేకపోవడంతో అదే మార్గం ద్వారా లోపలికి వెళ్లినట్లు తెలుస్తోంది. లైంగిక దాడికి ప్రయత్నించగా శిరీష ప్రతిఘటించి కేకలు వేయడంతో ఆమె గొంతు నులిమి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది.

నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అయితే ఈ ఘటనలో సనావుల్లా ఒక్కడే ఉన్నాడా? మరెవరైనా సహకరించారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఫోరెన్సిక్ నివేదిక అందిన తర్వాత కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా నిందితుడు ఆదివారం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో శిరీష మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదికలో ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు నిర్ధారణ అయినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం పూర్తైన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**దాడులు, బెదిరింపులకు భయపడకుండా ప్రజాస్వామ్య పద్ధతిలోనే పోరాడతాం**

**భావజాలాన్ని భావజాలంతోనే ఎదుర్కోవాలని, నిందితులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి**



ఇది కద నిజం, అత్తాపూర్ :నాంపల్లిలోని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సుల్గే వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయడం సహజమని, అయితే రాజకీయ విభేదాలకు దాడులు మరియు బెదిరింపులు ఎంతమాత్రమూ పరిష్కారం కావని ఆయన స్పష్టం చేశారు. ఎమర్జెన్సీ ముగిసి దశాబ్దాలు గడిచినా, ప్రశ్నించే గొంతులను అణచివేయాలనే ధోరణి ఎక్కడ కనిపించినా దానిని ప్రజాస్వామ్యవాదులంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. భావజాలాన్ని భావజాలంతోనే ఎదుర్కోవాలి తప్ప దాడులతో కాదని పేర్కొన్నారు. బీజేపీ కార్యాలయాలపై దాడులు చేయడం ద్వారా తమ కార్యకర్తలను భయపెట్టగలమని భావిస్తే అది వారి భ్రమ మాత్రమేనని వెంకటేష్ హెచ్చరించారు. ఎంతటి దాడు ఎదురైనా లొంగకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ పోరాటాన్ని, ప్రశ్నలను కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య విలువలు, చట్టపరమైన వ్యవస్థ, పరస్పర గౌరవాన్ని కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ ప్రాథమిక బాధ్యత అని గుర్తుచేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత పోలీస్ ఉన్నతాధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలపరిచేది దాడులు కాదని, ప్రజల తీర్పు, చట్టబద్ధమైన పోరాటం మరియు సుస్థిరమైన ప్రజాభిప్రాయమేనని ఈ సందర్భంగా సుల్గే వెంకటేష్ స్పష్టం చేశారు.

# హైదర్‌గూడలో ఓటర్ల ప్రత్యేక సవరణ అవగాహన కార్యక్రమం



ఇది కద నిజం, అత్తాపూర్ :ఓటర్ల ప్రత్యేక సవరణ (S.I.R) రెండవ దశ అవగాహన కార్యక్రమంలో భాగంగా హైదర్‌గూడ వార్డు కార్యాలయంలో ఓటర్ల విచారణ కార్యక్రమం నిర్వహించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు అధికారుల ఎదుట హాజరయ్యారు. అధికారులు నిర్దేశించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒక సర్టిఫికెట్‌ను సమర్పించిన ఓటర్ల వివరాలను అధికారులు స్వయంగా పరిశీలించారు. ఆ పత్రాలను స్కాన్ చేసి, ఓటర్ యాప్ ద్వారా అప్రూవల్ చేపడుతూ ఓటు హక్కును ధ్రువీకరించే ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయ కార్యదర్శి సాబాధ విజయ్ కుమార్, రాష్ట్ర యువమోర్చా నాయకులు కుక్కునూరి కిరణ్ చారి, హైదర్‌గూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సులిగె మహేందర్, కాడెం శివకుమార్ పాల్గొని ఓటర్లకు పలు సూచనలు చేశారు. వార్డు అధికారులు జగదీశ్, బిఎల్‌ఓలు వంశీ, మహేందర్, రాణి, బత్తుల శోభన్, నిషిత, సాయి ప్రభు గౌడ్, సురేష్, వినయ్, లక్ష్మి, మౌనిక, అనురాధలతో పాటు హైదర్‌గూడ డివిజన్‌కు చెందిన ఓటర్లు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఓటు హక్కును ధ్రువీకరించుకున్నారు.

# మదనపల్లె నీటి సమస్య పట్ల చిత్తశుద్ధి లేని పాలకులు

**చెవిటివాని ముందు శంఖం ఊదినట్లు కూటమి ప్రభుత్వ తీరు**

**మదనపల్లె వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎస్. నిసార్ అహమ్మద్ అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం**



ఇది కద నిజం, ఆంధ్రప్రదేశ్ :మదనపల్లె పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతో పాటు, యుద్ధ ప్రాతిపదికన శాండ్ రింగ్ బండ్ ఏర్పాటు చేయాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఎస్. నిసార్ అహమ్మద్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నిసార్ అహమ్మద్ మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి అవసరాలు కూడా రోజురోజుకూ పెరుగుతున్నాయని అన్నారు. 2011 జనగణన ప్రకారం మదనపల్లె పట్టణ జనాభా సుమారు 1.36 లక్షలు కాగా, ప్రస్తుతం పట్టణ జనాభా సుమారు రెండు లక్షలకు చేరువలో ఉన్నట్లు అంచనాలు ఉన్నాయని తెలిపారు. పట్టణ నీటి సరఫరా ప్రణాళికల్లో సాధారణంగా ఉపయోగించే 135 లీటర్లు/వ్యక్తి/రోజు ప్రమాణాన్ని తీసుకుంటే, 2011 జనాభాకే రోజుకు సుమారు 1.83 కోట్ల లీటర్లు (18.3 మీఎ) నీరు అవసరమవుతుందని, ప్రస్తుత జనాభాను సుమారు రెండు లక్షలుగా పరిగణిస్తే రోజుకు దాదాపు 2.7 కోట్ల లీటర్ల (27 మీఎ) నీటి అవసరం ఏర్పడుతుందని వివరించారు. నీరు వచ్చే సమయంలో నిల్వ చేసుకునే సామర్థ్యం ఉండాలని అందుబాటులోకి వచ్చే నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మదనపల్లె వైయస్సార్ సిపి ఎస్. నిసార్ అహమ్మద్ అన్నారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కు నీరు వచ్చినా, ఆ నీటిని చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో సురక్షితంగా నిల్వ చేసుకునే పరిస్థితులు పూర్తిస్థాయిలో లేకపోతే ప్రజలకు ఆ నీటిని ఎలా అందిస్తారని ప్రశ్నించారు. చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కు అనుసంధానం చేసి మదనపల్లెకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టు చేపట్టిన నేపథ్యంలో, నీరు వచ్చే సమయానికి అన్ని రక్షణ చర్యలు పూర్తి చేసి సిద్ధంగా ఉంచడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ట్యాంక్‌లో నీటిని నిల్వ చేసే ముందు బండ్ బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట శాండ్ రింగ్ బండ్/ఇసుక బస్తాల రక్షణ బండ్‌ను అత్యవసరంగా ఏర్పాటు చేయాలని, నీరు వచ్చిన తర్వాత బండ్‌కు నష్టం జరిగి నిల్వ నీరు వృథా అయితే, అది మదనపల్లె ప్రజలకు తీవ్ర నష్టం కలిగించడంతో పాటు ప్రభుత్వానికి కూడా ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉందని, కదిరి నియోజకవర్గంలోని చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసే పరిస్థితి ఏర్పడితే, ఆ నీటిని సమర్థవంతంగా చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నిల్వ చేసుకునేందుకు అధికారులు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను కోరారు. “నీరు వచ్చిన తర్వాత ఏర్పాట్లు చేయడం కాదు... నీరు వచ్చేలోపే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి. మదనపల్లె ప్రజలకు ఉపయోగపడాల్సిన ఒక్క చుక్క నీరు కూడా వృథా కాకుండా చూడాలి” అని వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. జిల్లా కలెక్టర్ గారు సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్. రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సి పి రాఘవ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాసులు, గుండ్లూరు రఫీక్,ఈశ్వర్ నాయక్, ప్రసాద్ బాబు, పాల్ చంద్రశేఖర్, సుధాకర్, మాజీ సర్పంచ్ లు నాగరాజ రెడ్డి, శరత్ రెడ్డి, తట్టి నాగరాజ రెడ్డి, నాయకులు జన్నే రాజేంద్ర నాయుడు, యూనస్, కొత్తపల్లి మహేష్, ఎన్. నవాజ్ అలీ ఖాన్, తాజ్ భాషా, సాదిక్, యాసీన్, నూర్ మొహమ్మద్ ఖాన్ , చిప్పిలి మల్లికార్జున రెడ్డి, బొమ్మిశెట్టి మధు, రాజేశ్, ఆవుల విశ్వనాథ్, వడిగల శ్రీకాంత్, తాళే సుబ్రహ్మణ్యం, చరణ్, జాఫర్, రియాజ్, జైనుల్లా, వినుత బాయి, నాగమణి, షేక్ షమ, మహేశ్, షేక్ జబి, ముజీబ్ , ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.




# BJYM ఆధ్వర్యంలో “ఫీజు బకాయి బీజేపీ లడాయి” నిరసన దీక్ష



ఇది కద నిజం:40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, భారతీయ జనతా యువ మోర్చా (BJYM) ఆధ్వర్యంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి ఒక రోజు నిరసన దీక్ష చేపట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని IDPL చౌరస్తా వద్ద నిర్వహించిన ఈ నిరసన దీక్షలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని, తమకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులకు రూ.15 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉండటం అత్యంత దురదృష్టకరమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడకుండా, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నిరసన దీక్షలో గిరివర్ధన్ రెడ్డితో పాటు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు శేఖర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు గరిగె శేఖర్, వేణు, మహిళా నాయకురాళ్లు విజయలక్ష్మి, మాధురి తదితరులు దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి,మాజీ ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, జిల్లా సర్ ఇన్‌చార్జ్ నందనం దివాకర్, పార్లమెంట్ మాజీ కన్వీనర్ ఆర్.కే. శ్రీనివాస్, ఉప్పల్ సర్ కన్వీనర్ గోపాల్ గౌడ్,కిసాన్ మోర్చా అధ్యక్షులు మల్లేష్ యాదవ్, గిరిజన మోర్చా అధ్యక్షులు వెంకటేష్ నాయక్, నాయకులు రాజా సదానందం, క్రిష్ణారెడ్డి, కట్టా కుమార్ జిల్లాలో డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొని నిరసన దీక్షకు మద్దతు తెలిపారు. విద్యార్థుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బిజెవైఎం జిల్లా అధ్యక్షులు శ్రీనాథ్, నాయకులు శ్యామ్,పృథ్వి, ఆదిత్య డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల విడుదల కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

# లలితాబాగ్, మల్లికార్జున్ నగర్ సమస్యలపై జాయింట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌కు ఫిర్యాదు



ఇది కద నిజం, రాజేంద్రనగర్: రాబోయే గణేష్ చతుర్థి సందర్భాన్ని పురస్కరించుకుని రాజేందర్ నగర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ‘ప్రజావాణి’ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ కి ప్రజా ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ నగర్ జోన్ పరిధిలోని పలు డివిజన్లలో నెలకొన్న ప్రజా సమస్యలను జాయింట్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా లలితాబాగ్, మల్లికార్జున్ నగర్ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే సీసీ ప్యాచెస్ పనులు చేపట్టాలని, అలాగే వీధి దీపాల నిర్వహణను పునరుద్ధరించి రాత్రివేళల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. అంతేకాకుండా, లలితాబాగ్ వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జ్ స్ట్రోమ్ వాటర్ లేన్ తీవ్రంగా దెబ్బతిని వర్షపు నీరు, మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తోందని వివరించారు. దీనివల్ల వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పగిళ్ల నరేందర్ రెడ్డి, కోశాధికారి గుండు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారం మండల కాంగ్రెస్‌లో కొత్త కమిటీకి కసరత్తు..

## పదవుల కోసం ఆశావహుల పేర్లు స్వీకరణ

**- కష్టపడిన కార్యకర్తలకే సముచిత ప్రాధాన్యం.. -మండల కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తాం -గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్‌కు పటిష్ట పునాది..- ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి -మంత్రి సీతక్క అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి.. -ఏటూరునాగారం కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు -ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని తిప్పికొడదాం.. -కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుదాం -మండల పార్టీ అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్**



**ఏటూరునాగారం, ములుగు ఆగస్టు 31:**

మంత్రి సీతక్క ఆదేశాలు, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు ఏటూరునాగారం మండల కాంగ్రెస్ నూతన కమిటీ ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ కార్యాలయంలో వివిధ పదవులకు ఆసక్తి ఉన్న ఆశావహుల నుంచి పేర్లను స్వీకరించారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు నూతన కమిటీలో సముచిత ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు నాయకులు తెలిపారు. మండలంతో పాటు గ్రామస్థాయిలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ములుగు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను గ్రామ గ్రామాన ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టి, రానున్న రోజుల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండ్ల దేవేందర్, ఆర్టీఏ సభ్యుడు వసంత శ్రీనివాస్, జిల్లా సెక్రటరీ ఎండి ఖలీల్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, ఎటూరునాగారం ఆత్మ డివిజన్ చైర్మన్ కర్ల అరుణ, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొండగొర్ల పోషయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, జిల్లా యువజన ఉపాధ్యక్షుడు సర్వ అక్షిత్, టౌన్ అధ్యక్షుడు కే. రంజిత్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, శివాలయం చైర్మన్ మడుగురి ప్రసాద్, మండల యూత్ అధ్యక్షుడు కంట కృష్ణారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు, సర్పంచులు, సీనియర్ నాయకులు, మహిళా, యువజన, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# త్వరలోనే సెట్స్‌లోకి!




నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన అభిమానులకు ఒక బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. ఇటీవల 'మైసా' సినిమా షూటింగ్ సమయంలో గాయపడి, గత కొంతకాలంగా విశ్రాంతి తీసుకుంటున్న ఆమె త్వరలోనే మళ్లీ కెమెరా ముందుకు రాబోతున్నట్లు స్పష్టం చేశారు. 'మైసా' సెట్స్‌లో ప్రమాదవశాత్తు రష్మిక కుడి కాలు తుంటి భాగానికి దెబ్బతగిలింది. దీంతో డాక్టర్ల సూచనల మేరకు ఆమె బెడ్ రెస్ట్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. షూటింగ్‌లకు దూరంగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియా ద్వారా నిరంతరం ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటూ వచ్చారు. తాను త్వరగా కోలుకుంటున్నానని, ఆరోగ్యం బాగుందని ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ ఇచ్చారు. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కొన్ని ప్రత్యేకమైన ఫొటోలను షేర్ చేస్తూ ఒక ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు.

"త్వరలోనే సెట్స్‌లోకి వెళ్తున్నాను.. కాకపోతే ఈ గ్యాప్‌లో గడిపిన ప్రశాంతమైన క్షణాలను ఎంతగానో మిస్ అవుతాను" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆమె షేర్ చేసిన పిక్స్‌లో పూజల్లో పాల్గొనడం, తన ప్రియమైన ఆత్మీయులతో సరదాగా గడపడం, పెంపుడు కుక్కతో ఆడుకోవడం, ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా గడిపిన క్షణాలు ఉన్నాయి. రష్మిక తిరిగి షూటింగ్‌కు సిద్ధమవుతున్నారనే వార్త తెలుసుకుని ఆమె అభిమానులు, నెటిజన్లు తీవ్ర ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కామెంట్స్ సెక్షన్‌లో ఆల్ ది బెస్ట్ చెప్తూ పోస్టులు పెడుతున్నారు. ప్రస్తుతం రష్మిక లైనప్‌లో 'మైసా', 'రణబాలి' వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటితో పాటు 'రాకా' అనే మరొక క్రేజీ సినిమాలో కూడా ఆమె నటించబోతున్నట్లు ఫిలిం నగర్ టాక్.

# 'జైలర్ 2'కి బిగ్ షాక్

సూపర్‌స్టార్ రజినీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'జైలర్ 2' ఒకటి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై మొదటి భాగం సాధించిన భారీ విజయంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'జైలర్' బాక్సాఫీస్ వద్ద సెన్సేషనల్ హిట్‌గా నిలవడంతో.. ఇప్పుడు సీక్వెల్‌లో రజినీకాంత్ పాత్రను దర్శకుడు నెల్సన్ ఎలా చూపించబోతున్నారన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. అయితే ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ మొదటి నుంచీ చాలా పరిమితంగానే అప్‌డేట్స్ ఇస్తున్నారు. షూటింగ్, కథ, పాత్రలు, యాక్షన్ సీక్వెన్స్‌లకు సంబంధించిన




వివరాలను పెద్దగా బయటకు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో 'జైలర్ 2'పై అభిమానుల్లో క్యూరియాసిటీ మరింత పెరిగింది.

ఇప్పటివరకు అందుతున్న సమాచారం ప్రకారం 'జైలర్ 2'ను అక్టోబర్ 15న దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. పండుగ సీజన్ కావడంతో భారీ ఓపెనింగ్స్ సాధించేందుకు ఇది మంచి సమయంగా భావించారు. రజినీకాంత్‌కు ఉన్న క్రేజ్, 'జైలర్'కు వచ్చిన రెస్పాన్స్, నెల్సన్ దిలీప్‌కుమార్‌పై ఉన్న అంచనాలు కలిస్తే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో రికార్డులు సృష్టించే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటివరకు సినిమా అనుకున్న సమయానికి విడుదల చేయడంలో ఎలాంటి రాజీ లేదనే టాక్ వినిపించింది. కానీ తాజాగా ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం అక్టోబర్ 15న 'జైలర్ 2' విడుదల కావడం అనుమానమేననే ప్రచారం మొదలైంది.

సినిమా నిర్మాణ పనులు, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు, భారీ స్థాయిలో తెరకెక్కుతున్న యాక్షన్ సన్నివేశాలు వంటి అంశాల కారణంగా అనుకున్న సమయానికి సినిమాను పూర్తి చేయడం కష్టమవుతుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.అయితే ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది ప్రస్తుతానికి స్పష్టత లేదు. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు దీనిని కేవలం ప్రచారంగా మాత్రమే చూడాల్సి ఉంటుంది. 'జైలర్ 2'పై రజినీకాంత్ అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. మొదటి భాగంలో ముత్తువేల్ పాండియన్ పాత్రలో రజినీకాంత్ చూపించిన స్టైల్, యాక్షన్, డైలాగ్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. దీంతో సీక్వెల్‌లో ఆయన పాత్రను మరింత పవర్‌ఫుల్‌గా తీర్చిదిద్దుతారని అభిమానులు ఆశిస్తున్నారు.ఇలాంటి సమయంలో రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందనే వార్తలు రావడంతో ఫ్యాన్స్‌లో కొంత ఆందోళన మొదలైంది.

# పిల్లి చుట్టూ తిరిగే మిస్టరీ!

నటుడిగా వరుస సినిమాలతో బిజీగా ఉన్న కిరణ్ అబ్బవరం ఇప్పుడు నిర్మాతగా కూడా కొత్త ప్రయోగాలు చేస్తున్నారు. దాదాపు 50 మంది కొత్త నటీనటులతో రూపొందిన 'తిమ్మరాజుపల్లి టీవీ'తో నిర్మాతగా అరంగేట్రం చేసిన ఆయన, ఇప్పుడు తన రెండో ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టారు. ఈ సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈరోజు విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ మాత్రం సినిమాపై ఒక్కసారిగా క్యూరియాసిటీ పెంచేసింది. అసలు ఈ సినిమా కథ ఏంటి? గ్లింప్స్‌లో చూపించిన ఆ పిల్లికి కథతో ఉన్న సంబంధం ఏంటి? అనే ప్రశ్నలు ప్రేక్షకుల్లో మొదలయ్యాయి.

'హతః' టైటిల్‌ను ప్రకటించిన విధానం కూడా చాలా డిఫరెంట్‌గా ఉంది. గ్లింప్స్‌లో




ముందుగా చీకటిగా ఉన్న ఒక పెట్టె కనిపిస్తుంది. కెమెరా నెమ్మదిగా ఆ పెట్టె వైపు జూమ్ అవుతుండగా, అందులో ఒక పిల్లి ఉన్నట్లు చూపించారు. ఆ తర్వాత ఒక్కసారిగా 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు. సాధారణంగా టైటిల్ గ్లింప్స్‌లో సినిమా కథ, హీరో పాత్ర లేదా సినిమాలోని కీలకమైన సన్నివేశాలకు సంబంధించిన కొన్ని విజువల్స్ చూపిస్తుంటారు. కానీ 'హతః' టీమ్ మాత్రం అసలు కథకు సంబంధించిన ఎలాంటి క్లూ ఇవ్వకుండా కేవలం ఒక పిల్లి చుట్టూ మిస్టరీని క్రియేట్ చేశారు. త్వరలోనే టీజర్ ఉంటుందంటూ హింట్ కూడా ఇచ్చారు.

కిరణ్ అబ్బవరం, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా 'హతః' మూవీని నిర్మిస్తున్నారు. అనుష్ గోరక్ ఈ సినిమాకు కథ, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలను చేపట్టారు. జెసిన్ జార్జ్ సంగీతం అందిస్తుండగా, ఈ సినిమాలో కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవి, తనుజ పుట్టస్వామి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే సినిమాకు సంబంధించిన స్టోరీన్ మేకర్స్ రహస్యంగానే ఉంచుతున్నారు. కథ ఏమిటి? పాత్రలు ఎలా ఉండబోతున్నాయి? సినిమా ఏ జానర్‌లో తెరకెక్కుతోంది? అనే విషయాలపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గ్లింప్స్ ద్వారా కూడా కథను రివీల్ చేయకుండా కేవలం క్యూరియాసిటీని పెంచే ప్రయత్నం చేశారు. దీంతో 'హతః' ఒక థ్రిల్లర్ కథా, సస్పెన్స్ డ్రామానా లేదా మరో కొత్త జానర్‌లో తెరకెక్కుతున్న సినిమానా అనేది మాత్రం సస్పెన్స్ లో ఉంచారు.

కిరణ్ అబ్బవరం గతంలో నటుడిగా విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. రీసెంట్ గా 'చెన్నై లవ్ స్టోరీ' తో బ్లాక్ బస్టర్ హిట్ కూడా అందుకున్నాడు. ఇప్పుడు ప్రొడ్యూసర్ గా కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడం, డిఫరెంట్ కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంపై దృష్టి పెట్టారు. దాదాపు 50 మంది కొత్త నటీనటులతో 'తిమ్మరాజుపల్లి టీవీ'ని నిర్మించిన ఆయన, ఇప్పుడు 'హతః' తో మరో కొత్త తరహా కథను పరిచయం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. 'హతః' టైటిల్ గ్లింప్స్‌లో కథను చెప్పకుండా కేవలం ఒక పిల్లి, చీకటి పెట్టె, మిస్టీరియస్ క్యాప్షన్‌తో సినిమాపై క్యూరియాసిటీ పెంచేశారు. అసలు ఆ పిల్లి వెనుక ఉన్న కథ ఏంటి? ఈ మిస్టరీకి హీరో, కథతో ఉన్న సంబంధం ఏంటి? అనేది తెలియాలంటే సినిమా నుంచి వచ్చే తదుపరి అప్‌డేట్స్ కోసం వేచి చూడాల్సిందే.

# వెంకీ కోసం త్రివిక్రమ్ మాస్టర్ ప్లాన్!

తెలుగు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ఆదర్శకుటుంబం: హౌస్ నెం 47' సినిమా ముందు వరుసలో ఉంటుంది. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. ఆ సినిమాల విజయాల్లో వెంకటేశ్ నటన, త్రివిక్రమ్ రచన ప్రధాన పాత్రలు పోషించాయనడం అతిశయోక్తి కాదు. అప్పుడు వెంకటేశ్ సినిమాకి రచయితగా పనిచేసిన త్రివిక్రమ్.. ఇప్పుడు అదే




వెంకటేశ్‌ని డైరెక్ట్ చేస్తున్నారు. దాంతో 'ఆదర్శకుటుంబం' సినిమాపై ఆడియన్స్‌లో అంచనాలు ఆకాశమంత ఏర్పడ్డాయి. అక్టోబర్ 2న గాంధీజయంతి కానుకగా సినిమా విడుదల కానున్నది.

ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంబంధించిన ఓ అసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నది. ఆ వివరాల్లోకెళ్తే.. వెంకటేశ్ చిత్ర విజయాల్లో 'కూలీ నెం 1' సినిమా ఒకటి. ఆ సినిమాలోని 'దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా.. దయుంచయ్యా దేవా..' సాంగ్ ఎంత హిట్టో అందరికీ తెలిసిందే. వినాయకచవితి పందిళ్లలో నేటికీ ఈ పాట మారుమోగుతూనే ఉంది. ఆ పాటను ఈ సినిమా కోసం రీమేక్ చేస్తున్నట్టు తెలిసింది. ఇదే నిజమైతే.. సినిమాకు ఈ పాట ప్రత్యేక ఆకర్షణ కాకమానదు.క్లైమాక్స్, ఓ పాట మినహా ఈ సినిమా షూటింగ్ పూర్తయిందని టాక్. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో శ్రీనిధిశెట్టి కథానాయిక. నివేదా పేతురాజ్, యువిన, రాజ్ ప్రజ్వల్, రావురమేశ్, సత్య, బ్రహ్మాజీ ఇతర పాత్రధారులు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఈచిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే.

# కాలభైరవతో కావ్య లవ్!

మాసూద', 'బలగం' చిత్రాలతో కుర్రకారు మనసు దోచుకున్న భామ కావ్య కళ్యాణ్ రామ్.. ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్. కీరవాణి తనయుడు, సింగర్ కాలభైరవతో ప్రేమలో ఉందంటూ గత కొన్ని రోజులుగా వస్తున్న వార్తలకు చెక్ పడింది. సీక్రెట్‌గా సాగుతున్న ఈ జంట బంధంపై కావ్య స్వయంగా క్లారిటీ ఇచ్చేసింది. తన జీవితంలోకి సరైన వ్యక్తి వచ్చినప్పుడు ప్రపంచం అంతా ఎంతో అందంగా కనిపిస్తుందని ఆమె చెప్పారు. కొందరు మన జీవితంలోకి అడుగుపెట్టాక, దేవుడు మనపై ఎంత



ప్రేమ చూపిస్తున్నాడో అర్థమవుతుందంటూ ఆనందం వ్యక్తం చేశారు. తన సాధారణ రోజులను కూడా ఎంతో ప్రత్యేకంగా, సంతోషంగా మార్చినందుకు కాలభైరవకు ధన్యవాదాలు తెలిపారు. తనను ఈ ప్రపంచంలోనే అత్యంత అదృష్టవంతురాలిగా భావించేలా చేశారని చెప్పారు.

తన ఇష్టాయిష్టాలను కాలభైరవ ఎంత బాగా గుర్తుంచుకుంటారో కూడా ఆమె వివరించారు. తాను వద్దని పైకి చెప్పినా, తనకు డైట్ కోక్ కావాలనే విషయాన్ని ఆయన ముందే గ్రహిస్తారని పేర్కొన్నారు. ఇద్దరి మధ్య ఉండే ఇలాంటి చిన్న చిన్న మధురమైన క్షణాలు జీవితాంతం కొనసాగాలని కోరుకున్నారు. గోప్యంగా ఉన్న తమ బంధాన్ని కావ్య ఇలా అధికారికంగా బయటపెట్టడంతో ఈ పోస్ట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. చైల్డ్ ఆర్టిస్ట్‌గా పరిచయమై ఇప్పుడు ఒక గొప్ప సంగీత కుటుంబంలోకి కోడలిగా వెళుండటంతో అభిమానులు, నెటిజన్లు కొందరు షాక్ అవుతుండగా.. మరికొందరు ఈ కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.